సాక్షి
అనంతపురం
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



చెత్త విషయంలో డిష్యుం డిష్యుం
చెత్త పడేసే విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం గుత్తి ఆర్‌ఎస్‌లో చోటు చేసుకుంది. 8లో



టమాట కిలో రూ.8
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో ఆదివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

1.51 లక్షల క్వింటాళ్లతో ఖరీఫ్ విత్తన ప్రణాళిక

- 1.33 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ



అనంతపురం అగ్రికల్చర్: మే నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్–2025కు సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు విత్తన ప్రణాళిక సిద్ధం చేశారు. కమిషనరేట్‌కు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. 1,51,698 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని నివేదించారు. ప్రధానపంట వేరుశనగ 1.45 లక్షల హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేసి 1,33,763 క్వింటాళ్లు ప్రతిపాదించారు. అలాగే 18,100 హెక్టార్లలో వరి సాగులోకి రానుందని, అందుకు 8,054 క్వింటాళ్లు, మొక్కజొన్న 11,500 హెక్టార్లకు 2,300 క్వింటాళ్లు, జొన్న 5 వేల హెక్టార్లకు 375 క్వింటాళ్లు, కొర్ర 2 వేల హెక్టార్లకు 60 క్వింటాళ్లు అవసరమవుతాయని నివేదించారు. ఇక.. 34,500 హెక్టార్ల కందికి 5,347 క్వింటాళ్లు, 16,300 హెక్టార్ల ఆముదం 815 క్వింటాళ్లు, 1,700 హెక్టార్ల పొద్దు తిరుగుడుకు 85 క్వింటాళ్లు, 1,200 హెక్టార్ల ఉలవకు 125 క్వింటాళ్లు, 200 హెక్టార్ల మినుము పంటకు 24 క్వింటాళ్లు అవసరం కాగా పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్ మెన్యూర్) కింద 250 క్వింటాళ్ల చొప్పున జీలుగ, జనుము, పిల్లిపెసర.. మొత్తం 750 క్వింటాళ్లు అవసరమని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌కేల వేదికగా 31 మండలాల నుంచి వచ్చిన విత్తన అవసరాల ఆధారంగా ప్రతిపాదనలు పంపినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. మార్చిలో కమిషనరేట్ నుంచి అనుమతులు రాగానే ఏప్రిల్ నెలాఖరు నుంచి విత్తన పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.

నేడు 'దుర్గం'లో 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక జిల్లాస్థాయి కార్యక్రమాన్ని సోమవారం రాయదుర్గం పట్టణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. రాయదుర్గం డ్వామా ఏపీడీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం మొదలవుతుందన్నారు. తనతో పాటు జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని చెప్పారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలను అర్జీ రూపంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలన్నారు. రాయదుర్గంలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నందున కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక ఉండదన్నారు.

ఆరిన ఆశల దీపం.. అయ్యో ఎంత ఘోరం

- బైకును ఢీ కొన్న కారు
- మూడేళ్ల బాలుడి దుర్మరణం
- తల్లిదండ్రులకు తీవ్రగాయాలు



ఘటనాస్థలిలో బాలుడు రిత్విక్‌రెడ్డి మృతదేహం, పక్కనే గాయాలతో సొమ్మసిల్లి పడిపోయిన తండ్రి సురేంద్రరెడ్డి

పెద్దవడుగూరు: బైకును కారు ఢీ కొన్న ఘటనలో మూడేళ్ల బాలుడు దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని గోపురాజుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. వివరాలు.. మండలంలోని దిమ్మగుడి గ్రామానికి చెందిన సురేంద్ర రెడ్డి తన భార్య సులోచనమ్మ, కుమారుడు రిత్విక్ రెడ్డి(3)తో కలిసి ఆదివారం పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరులో జరుగుతున్న అశ్వత్థం తిరునాలకు బైకుపై వెళ్లారు. స్వామిని దర్శించుకున్న అనంతరం స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలో గోపురాజుపల్లి వద్ద వీరి బైకును ఓ కారు వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన బాలుడు రిత్విక్ రెడ్డి ఘటనా స్థలిలోనే ప్రాణాలు విడిచాడు. సురేంద్ర రెడ్డి, సులోచనమ్మకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. తమ ఆశలదీపం ప్రాణాలు విడిచాడని తెలుసుకున్న వారు.. ఘటనాస్థలిలోనే సొమ్మసిల్లి పడిపోయారు. కారు డ్రైవర్ చిన్న దస్తగిరి మద్యం మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. బైకును ఢీకొన్న అనంతరం కారు బోల్తా పడింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

- ఇటీవల అనంతపురం నగరంలోని అరవిందనగర్‌లో ఓ వైద్యుడు ఇల్లు కట్టేందుకు శ్రీకారం చుట్టారు.అయితే, ఆక్రమణలున్నాయంటూ నగరపాలక సంస్థ అధికారులే కాకుండా కొందరు పాలక వర్గ నేతలు ఆయన్ను వేధించడం ప్రారంభించారు. దీంతో సదరు వైద్యుడు వారు అడిగినంత సమర్పించుకోవడంతో ఇక అటు వైపు చూడలేదు.
- అనంతపురం సప్తగిరి సర్కిల్‌లోని లలితా జ్యువెలరీ షాపు పక్కనే 10 సెంట్ల స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోంది. వాస్తవానికి ఇక్కడ సెల్లార్ పర్మిషన్ లేకున్నా తవ్వుతున్నారు. ఇందుకు సదరు నిర్మాణదారుడి నుంచి కార్పొరేషన్‌లో ముఖ్య వ్యక్తికి రూ.10 లక్షలు ముట్టినట్లు తెలిసింది.



అడిగినంత కొట్టు.. అటు చూస్తే ఒట్టు

అనంత కార్పొరేషన్‌లో భారీగా వసూళ్ల పర్వం

- భవన నిర్మాణదారుల నుంచి అక్రమంగా రూ.లక్షల వసూళ్లు
- ఖజానాకు చేరాల్సిన సొమ్ము నేతలు, అధికారుల జేబుల్లోకి
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



అనంతపురం వేణుగోపాల్ నగర్‌లో అక్రమంగా సాగిస్తున్న భవన నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం నగరపాలక సంస్థ అవినీతికి అడ్డాగా మారింది. లంచమిస్తే పెద్ద నేరం కూడా ఇక్కడ చిన్నదైపోతోంది. ఇవ్వకపోతే చిన్న తప్పుకూడా పెద్ద పాపమై నిలువెల్లా ముంచుతోంది. రూ. 10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ ఎక్కడ పడితే అక్కడ లంచాలు లాగుతున్నారు. ముఖ్య నేతలు మొదలుకుని పాలక వర్గంలోని కొందరు నేతలు, కిందిస్థాయి ఉద్యోగుల వరకూ నగరవాసులను పీల్చి పిప్పిచేస్తున్నారు. 'అడిగినంత ముట్టజెబితే ఇష్టారాజ్యంగా నిర్మాణాలు.. లేదంటే ఒక్క ఇటుక వేయనిస్తే ఒట్టు' అన్నట్లుగా ఇక్కడి పరిస్థితి తయారైంది. గృహ నిర్మాణాలంటే ఏమో అనుకోవచ్చు.. కమర్షియల్ కాంప్లెక్స్‌ల విషయంలో కూడా అడ్డదిడ్డంగా వెళుతున్న దుస్థితి నెలకొంది. వందలాది అక్రమ నిర్మాణాల నుంచి రూ. లక్షలు వసూలు చేసి తమ జేబుల్లో వేసుకుంటున్నారు.

బిల్లుల్లోనూ మతలబు..

అనంతపురం కార్పొరేషన్‌లోని వాహనాలకు వేసే డీజిల్ విషయంలోనూ కొందరు అధికారులు కక్కుర్తి పడుతున్నారు. వాహనాలకు డీజిల్ వేయకుండా వేసినట్టు బిల్లులు చూపించి భారీగా దోచుకుతింటున్న పరిస్థితి నెలకొంది.

రూ.35 లక్షలకు రూ.23 వేలే..!

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టుగా ఉంది కార్పొరేషన్‌లో పరిస్థితి. ఇటీవల ఓ కమర్షియల్ నిర్మాణానికి సంబంధించి వసూలు చేసిన పన్ను విషయమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. అనంతపురం వేణుగోపాల్ నగర్‌లోని ట్రిపుల్ ఎస్ బార్ ఎదురుగా ఉన్న 22 సెంట్ల స్థలంలో భవన నిర్మాణం చేపడుతున్నారు. ఇది పూర్తిగా కమర్షియల్ జోన్‌లో ఉంది. సదరు నిర్మాణదారుడు వాస్తవంగా రూ.35 లక్షలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సి ఉంది. కానీ ఆయన చెల్లించింది కేవలం రూ.23 వేలు. అయితే, ఓ ముఖ్య వ్యక్తి సదరు నిర్మాణదారుడి నుంచి రూ.10 లక్షలు తీసుకున్నట్టు తెలిసింది. ఈ విషయంపై ఇటీవల బదిలీ అయిన కమిషనర్ రామలింగేశ్వర్‌పై ఒత్తిడి తేవడంతో లొంగిపోయిన ఆయన.. సాధారణ నిర్మాణంగానే పరిగణించి సంతకాలు చేసినట్టు సమాచారం.

లలితా జ్యువెలరీ పక్కన కూడా..

నగరంలోని లలితా జ్యువెలరీ పక్కన జరుగుతున్న భవన నిర్మాణానికి కూడా 'ముఖ్య వ్యక్తి' రూ.10 లక్షలు ముక్కుపిండి వసూలు చేసినట్టు తెలిసింది. సెల్లార్‌కు అనుమతి తీసుకుని ఉంటే రూ.లక్షల ఆదాయం కార్పొరేషన్‌కు వచ్చి ఉండేది. కానీ ముఖ్య వ్యక్తికి డబ్బు ముట్టజెప్పి సదరు నిర్మాణ దారుడు శరవేగంగా సెల్లార్ నిర్మిస్తున్నారు. ఇలా అనంతపురం కార్పొరేషన్ పరిధిలో వందల భవన నిర్మాణాల నుంచి రావాల్సిన సొమ్ము కొందరు నేతలు, అధికారుల జేబుల్లోకి వెళ్తుండటంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది.

> **పరిశీలించి చర్యలు తీసుకుంటా**
>
> నేను బాధ్యతలు తీసుకున్న తర్వాత వేణుగోపాల్ నగర్‌లోని నిర్మాణ ఫైలుపై సంతకం చేయలేదు. అంతకుముందు ఉన్న కమిషనర్ ఏమైనా చేసి ఉండొచ్చేమో నాకు తెలియదు. అయినా ఓ సారి పరిశీలించి చర్యలు తీసుకుంటా.
> –బాలస్వామి, కమిషనర్, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్

కదులుతున్న బస్సు.. కిటికీలో కాళ్లు

- మద్యం మత్తులో వ్యక్తి నిర్లక్ష్యం
- సోషల్ మీడియాలో వైరల్
- ప్రభుత్వంపై నెటిజన్ల సెటైర్లు



కిటికీలో నుంచి కాళ్లు బయటకు పెట్టి ప్రయాణిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: పూటుగా మద్యం సేవించి ఆర్టీసీ బస్సు ఎక్కిన ఓ వ్యక్తి.. బస్సు కదిలాక కిటికీలో నుంచి కాళ్లు బయటకు పెట్టి దర్జాగా నిద్రపోయాడు. ఆదివారం సాయంత్రం గుత్తి నుంచి అనంతపురం వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆఖరి సీటులో కూర్చున్న మందుబాబు బస్సు కిటికీలో నుంచి తన రెండు కాళ్లు బయటకు పెట్టి ప్రయాణించాడు. ఈ విషయాన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరలైంది. దీనిపై పలువురు నెటిజన్లు సెటైర్లు పేల్చారు. 'మీకు పూర్తిగా కిక్ ఇస్తా, కంపెనీలతో మాట్లాడి నాణ్యమైన మద్యం అందిస్తా' అంటూ గతంలో సీఎం చంద్రబాబు మాట్లాడిన మాటలను ఈ సందర్భంగా ఓ వ్యక్తి గుర్తు చేశారు. 'కూటమి ప్రభుత్వానికి విద్య, వైద్యం మీద శ్రద్ధ లేదనడానికి ఉదాహరణ ఇది' అంటూ ఒకరు.. 'ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక విచ్చలవిడిగా బెల్ట్ షాపుల రూపంలో మద్యం దొరుకుతోంది. ఆరోగ్యం బాగాలేదని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే అక్కడ మందులు దొరుకుతాయో లేదో తెలియదు కానీ ఊరూరా బెల్టు దుకాణాల్లో మద్యం మాత్రం దొరుకుతోంది. చంద్రబాబు చెబుతున్న మంచి ప్రభుత్వం అంటే ఇదే' అంటూ మరొకరు కామెంట్ చేశారు.

ఏటి గంగమ్మా.. చల్లంగ చూడమ్మ



భక్తులతో కిటకిటలాడుతున్న పెన్నానది పరివాహక ప్రాంతం(ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో ఏటి గంగమ్మ

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన ఏటి గంగమ్మ తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ముందుగా భక్తులు పెన్నహోబిలంలో లక్ష్మీనృసింహస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పవిత్ర పెన్నా నదిలో మాఘమాస పుణ్యస్నానాలు ఆచరించారు. నది సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయంలో ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి కోళ్లు, గొర్రెలు, మేకలు బలి ఇచ్చి పచ్చని చెట్ల మధ్య వన భోజనాలు చేశారు. తిరునాల సందర్భంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ యువ నేత వై.భీమిరెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు వనజాక్షి, ఆకుకూర నాగరాజులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెన్నహోబిలం ఆలయ ఈఓ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయం దండగ' నినాదమే అమలు

- హంద్రీ–నీవా లైనింగ్‌తో విధ్వంసాలు చూస్తారు
- కమీషన్ల ఆశలో రైతులకు పరిటాల సునీత అన్యాయం
- త్వరలో వేలాదిమంది అన్నదాతలతో పాదయాత్ర
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: 'వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నినాదాన్నే పరిటాల సునీత అమలు చేస్తున్నారు. హంద్రీ–నీవా కాలువ పనులు రద్దు చేసే విషయంలో మొండి వైఖరి అవలంబిస్తున్నారు. లైనింగ్ పనులు పూర్తి చేస్తే కాలువకు దిగువనున్న 20 కిలోమీటర్ల వరకు భూగర్భ జలాలు అడుగంటి పచ్చని పొలాలు బీళ్లుగా మారతాయి. రైతులు వలసలు పోతారు. మళ్లీ ఫ్యాక్షన్ మొదలయ్యే ప్రమాదముంది. నియోజకవర్గంలోని రైతులను వలస బాట పట్టించాలని ఉంటే పనులు చేయండి. ఈ ప్రాంతం ఎడారిగా కావాలంటే పనులు చేపట్టండి. లైనింగ్ పనులను రైతులతో కలిసి అడ్డుకుంటాం. ఇది హెచ్చరిక కాదు చివరి అల్టిమేటం' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాతను కష్టపెట్టే విధానాలను మానుకోవాలని కోరారు. మొండివైఖరితో పనులు చేయాలని చూస్తే ఎక్కడికక్కడ అడ్డుకుని తీరతామన్నారు. పైసా ఖర్చు చేసే పని లేకున్నా పేరూరు డ్యాంకు పరిటాల సునీత నీళ్లు ఇవ్వలేకపోయారన్నారు. తాజాగా నియోజకవర్గాన్ని శాశ్వతంగా ఎడారిగా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇది ఆమెకు తగదన్నారు. త్వరలో ఆత్మకూరు మండలం సింగంపల్లి నుంచి వేలాదిమందితో పాదయాత్ర మొదలుపెట్టి ఆత్మకూరు, రాప్తాడు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల వరకు కొనసాగిస్తామన్నారు. పాదయాత్రలో పరిటాల సునీత అక్రమాలు, అవినీతిని ప్రజల్లో ఎండగడతామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల గోడు పట్టించుకునే నాథుడు లేడన్నారు. గతంలో 40 టీఎంసీల సామర్థ్యం ఉన్న హంద్రీ–నీవా కాలువను 5 టీఎంసీలకు కుదించిన చంద్రబాబు... నేడు 6 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే హంద్రీ–నీవా కాలువను కేవలం 300 చెరువులకు నీళ్లిచ్చే కాలువగా మారుస్తున్నారన్నారు. పాదయాత్రకు పోలీసు అధికారులు అనుమతులు ఇవ్వకపోతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ అనంతపురం రూరల్ మండలం–1,2 కన్వీనర్లు బండి పవన్, దుగుమర్రి గోవిందరెడ్డి, యూత్ విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి జవాన్ లక్ష్మన్న భౌతికకాయం

- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు
- నేడు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు





విషణ్ణ వదనంలో కుటుంబ సభ్యులు



బెంగళూరు ఎయిర్ పోర్టులో భౌతికకాయానికి గౌరవ వందనం చేస్తున్న జవాన్లు

కళ్యాణదుర్గం/బ్రహ్మసముద్రం: మూడు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ లక్ష్మన్న (33) భౌతికకాయాన్ని ఆదివారం రాత్రి ఆయన స్వగ్రామమైన బ్రహ్మసముద్రం తీసుకొచ్చారు. ముందుగా ఢిల్లీ నుంచి ఆర్మీ ప్రత్యేక విమానంలో బెంగళూరుకు తీసుకొచ్చారు. ఆర్మీ జవాన్లు గౌరవ వందనం సమర్పించిన అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గాన మినీ బస్‌లో భౌతిక కాయాన్ని గ్రామానికి తరలించారు. లక్ష్మన్నను కడసారి చూసేందుకు బంధువులు, స్నేహితులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భౌతికకాయం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తన కళ్లెదుటే భర్త మరణిస్తాడని కలలో కూడా ఊహించలేదంటూ లక్ష్మన్న భార్య లక్ష్మి విలపించడం అందరి వెంట కన్నీళ్లు పెట్టించింది. తమ తండ్రి ఎక్కడని పిల్లలు అడిగితే ఏం చెప్పాలంటూ పిల్లల్ని పట్టుకుని ఏడుస్తున్న ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. ఉన్నత స్థానానికి వెళ్లిన కుమారుడు ఇలా విగత జీవుడిగా తిరిగి వస్తాడని అనుకోలేదంటూ తల్లిదండ్రులు సుశీలమ్మ, రామచంద్రలు రోదించడం కలచివేసింది. లక్ష్మన్నతో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని బంధువులు, స్నేహితులు విలపించారు. బాధిత కుటుంబ సభ్యులను ఐటీబీపీ హెడ్ కానిస్టేబుల్ పిల్లలపల్లి నరసింహారెడ్డి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నేడు అంత్యక్రియలు..

జవాన్ లక్ష్మన్న అంత్యక్రియలు సోమవారం జరగనున్నాయి. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని పశు వైద్యశాల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్థలంలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుమతి, ఎస్‌ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

సెంట్రల్ యూనివర్సిటీలో కలకలం

- రక్షణ కరువైందంటూ విద్యార్థుల ఆందోళన



వాష్ రూం బయట ఉన్న సిమెంట్ పలకను తొలగించిన దృశ్యం



అర్ధరాత్రి ఆందోళన చేస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు

అనంతపురం: అనంతపురానికి సమీపంలోని జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో కలకలం రేగింది. తమ బాత్‌రూముల్లోకి, గదుల్లోకి అక్కడే పనిచేస్తున్న బిహార్ యువకులు తొంగి చూస్తున్నారని, తమకు రక్షణ కరువైందంటూ క్యాంపస్ విద్యార్థినులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మహిళా హాస్టల్ బాత్‌రూముల్లోకి ఒకరు తొంగిచూసినట్లు నీడ కనపడింది. దీంతో అప్రమత్తమైన విద్యార్థిని కేకలు వేయడంతో అగంతకుడు పారిపోయాడు. వాష్‌రూం బయట గల సన్‌సైడ్‌కు వెళ్లేందుకు వీలుగా ఉన్న గేటును సైతం తొలగించి.. అక్కడి నుంచి తొంగిచూస్తున్నట్లు నీడ కనపడింది. వాష్‌రూంలో సైతం తమకు భద్రత కరువైందని విద్యార్థినులు వాపోతున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి ఆందోళన మొదలుపెట్టిన విద్యార్థినులు ..రాత్రి 12 గంటలైనా కొనసాగించారు. దీంతో సెంట్రల్ వర్సిటీ అట్టుడికిపోతోంది. సుమారు వేయి మంది విద్యార్థులు ఆందోళనలో పాల్గొన్నారు.

గత డిసెంబర్ 9వ తేదీ ఇలాగే..

గతేడాది డిసెంబర్ 9వ తేదీన అర్ధరాత్రి కూడా వర్సిటీ భవన నిర్మాణ పనులు చేస్తున్న బిహార్‌కు చెందిన కొందరు యువకులు.. అమ్మాయిల స్నానాల గదులున్న వైపు తొంగి చూసేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ సమయంలో విద్యార్థినులు గట్టిగా కేకలు వేయడంతో సదరు వ్యక్తులు పారిపోయారు. భయంతో వణికిపోయిన విద్యార్థినులు డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు వర్సిటీకి చేరుకుని విచారణ చేశారు. అనుమానితులైన నలుగురు బిహార్ యువకులను అదుపులోకి తీసుకుని విచారించి వదిలేశారు. తాజాగా అదే ఘటన పునరావృతం కావడంతో విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. ఇంకా ఇలా ఎన్ని రోజులు బిక్కుబిక్కుమంటూ గడపాలని ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

లోపాలను వెంటనే సరిచేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

గుత్తి: పాఠశాల సముదాయాల పునర్ వ్యవస్థీకరణ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని వాటిని వెంటనే సవరించాలని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గుత్తిలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓబులేసు, వెంకటరెడ్డి మాట్లాడారు. పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్లాలంటే 25 నుంచి 30 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. దీంతో రెండు, మూడు వాహనాలు మారాల్సి వస్తుందన్నారు. పాఠశాల సముదాయానికి వెళ్లాలంటే ఆత్రుతలో ఉపాధ్యాయులు ప్రమాదాలకు గురయ్యే అవకాశ ఉందన్నారు. ఇవే కాకుండా అనేక సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వం లోపాలు సరిచేయాలని డిమాండ్ చేశారు.

ఆమిద్యాలలో భారీ చోరీ

- 20 తులాల బంగారు, రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు


బీరువా పగలగొట్టిన దృశ్యం

ఉరవకొండ: మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు ఇంట్లో బీరువాలోని 20 తులాల బంగారుతో పాటు రూ1.50 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. ఆమిద్యాలకు చెందిన దర్జీ నారాయణరావు, సర్వసతీ దంపతులు 10 రోజుల క్రితం వైద్య పరీక్షలు చేయించుకోవడానికి బెంగళూరుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా ధ్వంసం చేసి 20 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.50 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జనార్దన్‌నాయుడు కేసు నమోదు చేసుకొని క్లూస్‌టీం సహాయంతో వేలిముద్రలను సేకరించారు.

కారు బోల్తా .. వ్యక్తికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: అనంతపురం వైపు నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన మైకేల్ ఫెర్నాడెజ్ మరో వ్యక్తితో కలసి అనంతపురము వైపు నుంచి బెంగళూరుకు కారులో వెళుతున్నారు. అయితే మండల పరిధిలోని ఉన్న ఫారెస్ట్ నర్సరీ వద్దకు రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న మైకేల్ ఫెర్నాడెజ్ గాయపడగా చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడి నుంచి అతను చికిత్స నిమిత్తం బెంగళూరు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జిల్లాలోని కర్ణాటక సరిహద్దునున్న ఓ మండలంలో ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)గా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగి పనుల ప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో చూపారు. అయితే క్షేత్రస్థాయిలో ఎక్కడ వెతికినా వాటిజాడ కనిపించడం లేదు. దీనికితోడు వెండర్‌గా తన భర్త ఖాతాలోకి ఓ పంచాయతీ నుంచి రూ.5.76 లక్షల నగదు జమ చేశారు. ఇలా ఆమె చూస్తున్న మూడు, నాలుగు పంచాయతీల్లోనూ తన బినామీ ఖాతాల్లోకి ఎంచక్కా నిధులు మళ్లించుకున్నారు.

జిల్లా సరిహద్దు ప్రాంతంలోని మూడు పంచాయతీలకు టీఏగా విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి నేమ్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు తన తండ్రి ఖాతాలోకి రూ.3.15 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. క్షేత్రస్థాయిలో చూస్తే వాటి జాడ కనిపించడం లేదు.

మరో ఉద్యోగి తన భార్య పేరు మీద నేమ్‌బోర్డుల పేమెంట్ రూ.2.20 లక్షలు చేసుకున్నారు. తూతూ మంత్రంగా బోర్డులు ఏర్పాటు చేసి మమా అనిపించేశారు.

ఈ మూడుచోట్లే కాదు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఉపాధి సిబ్బంది బంధువులు, బినామీల ఖాతాల్లోకి నేమ్ బోర్డుల నిధులను మళ్లించారు. కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన పేమెంట్లలో అక్రమాలు వెలుగుచూస్తుండటం గమనార్హం.

బోర్డుల్లో బొక్కేశారు !

- ఉపాధి పనుల్లో సిబ్బంది చేతివాటం
- పనులు తెలిపే నేమ్‌బోర్డుల ఏర్పాటులో అవకతవకలు
- బోర్డులు పెట్టకుండానే నిధుల డ్రా
- బంధువుల ఖాతాల్లోకి రూ.లక్షల జమ


కొన్ని గ్రామాల్లో నేమ్‌బోర్డులు ఇలా దర్శనమిస్తున్నాయి !

రాయదుర్గం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. పేదలకు దక్కాల్సిన ఫలాలు పెద్దల జోక్యంతో విధుల్లో కొనసాగుతున్న ఉద్యోగులు, సిబ్బంది జేబులోకి చేరుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 90 శాతం పంచాయతీల్లో క్షేత్రసహాయకులుగా టీడీపీ నేతలు తమ వారి నియమకానికే పెద్దపీట వేశారు. వారికి వంతు పాడే ఉద్యోగులనే జత చేశారు. దీన్నే అదునుగా తీసుకున్న కొందరు అందినకాడికి దోచేస్తున్నారు.

జిల్లాలో 2.60 లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలో 2.60 లక్షల యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 4.58 లక్షలు కూలీలుగా నమోదు చేశారు. 2024–25లో 1.15 కోట్ల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. రూ.310 కోట్లు ఖర్చు చేసేలా ప్రణాళికలు చేపట్టారు. ఇప్పటికే 94.07 లక్షల పనిదినాలు పూర్తిచేశారు. రూ.249.9 కోట్లు కూలీల ఖాతాల్లో జమచేశారు. మిగిలిన 20.3 లక్షల పనిదినాలు మార్చి ఆఖరు నాటికి పూర్తిచేయాలి. దీని ఆధారంగా సుమారు 11,356 పనులు మెటీరియల్ కంపోనెంట్ ద్వారా పూర్తిచేశారు. రూ.కోట్లలో అభివృద్ధి పనులకు ఖర్చుచేశారు. ఈ పనులు పూర్తయితే ప్రదేశాల్లో ఆ వివరాలు తెలిపేలా నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలి. ఒక్కో బోర్డు ఏర్పాటుకు రూ.1500, వర్క్ ఫైలింగ్ కోసం రూ.100 ప్రకారం రూ.1600 చెల్లిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా ఓ వెండర్ ఖాతా తెరిచి పనులు చేపట్టాక వారికే ఆ నగదు జమచేస్తారు. అయితే ఆ నిధులపై కన్నేసిన కొందరు అధికారులు వాటిని పక్కదారి పట్టించేలా కుట్ర చేశారు. నేమ్ బోర్డులు పెట్టకనే.. పెట్టినట్లు రికార్డుల్లో చూపి నిధులు బొక్కేస్తున్నారు. దీనికి వారి భార్యలు, తండ్రులు, బంధువులు, బినామీలను వెండర్లుగా చేర్చి వారి ఖాతాల్లోకి నగదును మళ్లిస్తున్నారు. ఒకరినిచూసి మరొకరు అన్నట్లు జిల్లా వ్యాప్తంగా చాలా మండలాల్లో ఈ దందా గుట్టుగా సాగించినట్లు తెలుస్తోంది.

సమగ్రంగా విచారిస్తాం



ఉపాధి హామీ పథకంలో పైసా అవినీతికి కూడా ఆస్కారం లేదు. ఎక్కడైనా అలా జరిగి ఉంటే సత్వరం చర్యలు చేపడతాం. సిబ్బంది కొందరు నేమ్ బోర్డుల నిధులు వారి బంధువుల ఖాతాలకు మళ్లించిన విషయం నా దృష్టికి రాలేదు. విచారించి బాధ్యులపై చర్యలు చేపడతాం. పనుల ప్రదేశాల్లో తప్పక బోర్డులు పెట్టాలి. లేకుంటే సామాజిక తనిఖీల్లో రికవరీ చేస్తారు. తీవ్రతను బట్టి సీరియస్‌గా యాక్షన్ ఉంటుంది. దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తాం.

– సలీమ్‌బాషా, డ్వామా పీడీ, అనంతపురం

తనిఖీలు నిల్..

బ్రహ్మసముద్రం మండలంలో ఇటీవల వెలుగుచూసిన ఓ ఘటనతో అక్రమాలు బహిర్గతమయ్యాయి. క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేకపోవడం, ఏపీడీలు మొక్కుబడిగానైనా తనిఖీలు నిర్వహించకపోవడం, ఏపీఓలు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తే మరిన్ని అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంది.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)


ప్రభుత్వానికి కనువిప్పు కల్గిస్తాం

- వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస


మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఉపాధి కూలీల పొట్ట కొడుతున్న ప్రభుత్వానికి కనువిప్పు కల్గించేలా వైఎస్సార్‌సీపీ కార్యాచరణ సిద్ధం చేసింది. ఉపాధి కూలీల విషయంలో హైకోర్టు తీర్పును అమలు చేయాలి. ఇందులో భాగంగానే ఈ నెల 17న కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్నామని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం ఉపాధి హామీ పనుల్లో 50 శాతం కూలీలకు ఉపాధి చూపించాలన్న నిబంధనను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.69 లక్షల పనిదినాలు కల్పించలేదని, అందుకు సంబంధించి రూ.700 కోట్ల నిధులు టీడీపీ నాయకుల ఖాతాల్లోకి వెళ్లాయని విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మంత్రి వర్గంలో ఆయన ర్యాంక్ ఎక్కడో చెప్పాలన్నారు. మీ స్థానాన్ని పదో స్థానంలోకి పడేసిన సీఎం చంద్రబాబు వైఖరిపై మీ నిర్ణయం ఏమిటో తెలియజేయాలన్నారు. పంచాయితీరాజ్ శాఖకు మంత్రిగా ఉన్న పవన్‌కళ్యాణ్ ఉపాధి కూలీలకు అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉపాధి కూలీలకు కలెక్టర్ న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా నారాయణస్వామి తిరునాల


అలంకరణలో అశ్వర్థనారాయణుడు


స్వామి దర్శనం కోసం క్యూలైన్లో వేచివున్న భక్తులు

పెద్దపప్పూరు: అశ్వర్థనారాయణస్వామి మూడో ఆదివారం తిరునాల అత్యంత వైభవంగా జరిగింది. వేల సంఖ్యలో భక్తులు క్షేత్రానికి పెన్నానదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామికి పొంగళ్లను ప్రసాదంగా పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. తిరునాల సందర్భంగా ఏర్పాటు చేసిన గాజుల అంగళ్లు, చిన్నారుల ఆటవస్తువుల దుకాణాలు, తినుబండారాల షాపులు కిటకిటలాడాయి. పలు గ్రామాలకు చెందిన భక్తులు అన్నదానం చేశారు. దాతలు మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తును పర్యవేక్షించారు.

చెత్త విషయంలో డిష్యుం.. డిష్యుం


తీవ్రంగా గాయపడిన సాయమ్మ, వంశీ, రసూల్

గుత్తి: చెత్త పడేసి విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం గుత్తి ఆర్ఎస్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రసూల్– సాయమ్మ ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. చెత్త పడేసే విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో కత్తులు, కట్టెలతో పరస్పరం దాడులు దిగారు. ఈ ఘటనలో తల్లీ కొడుకు వంశీ, సాయమ్మ , రసూల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సందడిగా రాతి దూలం పోటీలు


దూలాన్ని లాగుతున్న ఎద్దులు

గుత్తి రూరల్: మండల పరిధిలోని తొండపాడులోని బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న రాతిదూలం లాగుడు పోటీలు రెండోరోజు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం ఆరు, ఆరుపళ్ల విభాగంలో వృషభాల పోటీలు పోటాపోటీగా జరిగాయి. గ్రామంలో జరుగుతున్న పోటీలలో కర్నూలు జిల్లా తాంద్రపాడు గ్రామానికి చెందిన చిన్న రత్నం వృషభాలు 5.135 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.35 వేలు గెలిచాయి.

'మిస్టర్ సౌత్ ఇండియా' పోటీల్లో ప్రతిభ


బాడీ బిల్డర్ కొలిమి దస్తగిరి

రాయదుర్గంటౌన్: బెంగళూరులో ఆదివారం జరిగిన మిస్టర్ సౌత్ ఇండియా మెన్స్ ఫిజిక్ బాడీ బిల్డింగ్ పోటీల్లో అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణానికి చెందిన యువకుడు కొలిమి దస్తగిరి మూడో స్థానం సాధించారు. ఆయన మొదటిసారిగా ఈవెంట్‌లో పాల్గొని ఈ ఘనత సాధించారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అనేక మంది బాడీబిల్డర్లు పాల్గొనగా మన రాష్ట్రం నుంచి పాల్గొన్న ఏకైక పోటీదారుడు దస్తగిరి కావడం విశేషం. మొత్తం 60 మంది పోటీల్లో పాల్గొనగా దస్తగిరి మూడోస్థానాన్ని దక్కించుకున్నాడు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మున్ముందు రాష్ట్రం నుంచి మరిన్ని పోటీల్లో పాల్గొంటానని దస్తగిరి పేర్కొన్నారు.

కుంభమేళాకు వెళ్లిన తాడిపత్రి వాసులకు గాయాలు


ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు

తాడిపత్రిటౌన్: పట్టణం నుంచి కుంభమేళాకు వెళ్లిన తాడిపత్రి వాసులు ఆదివారం ప్రమాదానికి గురయ్యారు. తాడిపత్రి నుంచి కుంభమేళాకు ప్రైవేట్ ట్రావెల్ బస్సులో దాదాపు 40 మంది వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కాశీకి దాదాపు 30 కిలో మీటర్‌ల దూరంలో వారి బస్సును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొంది. దీంతో దాదాపు ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కడప రోడ్డులో ఉన్న శివాలయం నిర్వాహకుడు రంగస్వామి, బాలరంగయ్య దంపతులకు గాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రులను వారణాసి కలెక్టర్, ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


చిన్నారుల నృత్య ప్రదర్శన

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రమైన అనంతపురంలో నిర్వహించిన బాలోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆదివారం నిర్వహించిన ముగింపు వేడుకల్లో జానపద గీతాలు, సందేశాత్మక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలతో విద్యార్థులు అలరించారు. పెద్ద సంఖ్యలో వీక్షకులు తరలిరావడంతో స్థానిక లలితకళాపరిషత్తు, గిల్డ్ ఆఫ్ సర్వీసు ప్రాంగణాలు కిటకిటలాడాయి. సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకల్లో ప్రతిభ చాటిన వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ చైర్‌పర్సన్ షమీమ్, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, నిర్వాహకులు సావిత్రి, లలితకళాపరిషత్తు కార్యదర్శి పద్మజ, బాలోత్సవం కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రెజరర్ జిలాన్, తరిమెల అమరనాథరెడ్డి, సీనియర్ కవి నబీరసూల్, డాక్టర్ కొండయ్య, కత్తి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శన



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కొత్త ఫాస్టాగ్ రూల్స్ తప్పనిసరి



ఇక ఫాస్టాగ్‌లో తగిన బాలెన్స్ ఉండాల్సిందే

హిందూపురం అర్బన్: జాతీయ రహదారులు, ఇతర చోట్ల టోల్‌గేట్స్ దాటి వెళ్లే వాహనదారులు (కార్లు, బస్సులు, లారీలు తదితర వాహనాలు) తప్పనిసరిగా సోమవారం నుంచి నూతన ఫాస్టాగ్ రూల్స్ పాటించాలి. ఈ నెల 17 నుంచి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త ఫాస్టాగ్ రూల్స్ అమలులోకి తెచ్చింది. ఈ విధానం ప్రకారం వాహనదారులు కొత్త చెల్లింపు విధానాలు పాటించకపోతే ఆదనంగా ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానంగా టోల్ ప్లాజా వద్దకు వెళ్లే 75 నిమిషాల ముందే తగిన రెండింతల మొత్తం ఫాస్టాగ్‌లో ఉండేలా రీఛార్జ్ చేసుకోవాలి. అలాగే రవాణా కార్యాలయంలో కేవైసీ చేయించుకొని తీరాలి. కొంతమంది ఇప్పటికీ అడపాదడపా వాహనాలు బయటకు తీసి తిప్పేవారు టోల్‌ప్లాజా వద్దకు వెళ్లేందుకు 5 నిమిషాల ముందు రీఛార్జ్ చేస్తుంటారు. ఇకమీదట అలా కుదరదు. అందుకు జాతీయ రహదారుల అధీకృత సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) స్వస్తి పలికింది. తగిన మొత్తం ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేని పక్షంలో డబుల్ మొత్తం చెల్లించక తప్పదు. త్వరిత గత ప్రయాణం, డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు ప్రోత్సహించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఈ నిబంధనను సోమవారం తెల్లవారుజాము నుంచి అమల్లోకి తీసుకొచ్చింది.

మెట్టినింటికి తీసుకెళ్లాలని అడిగినందుకు దాడి

- న్యాయం చేయాలంటున్న బాధితురాలు

బొమ్మనహాళ్: మెట్టినింటికి తీసుకెళ్లాలని అడిగినందుకు భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులు చితకబాదారని బాధితురాలు సాయిలీల ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ శివ విచారణ చేపట్టారు. బాధితురాలి వివరాలమేరకు.. మండల పరిధిలోని తగ్గపర్తికి చెందిన సాయిలీల, కణేకల్లు మండలం కలేకుర్తికి చెందిన లాలుస్వామి మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెద్దల అంగీకారంతో గత నెల 24న పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే తగ్గపర్తిలోని తన అక్క ఇంట్లో ఉంటున్న లాలుస్వామి.. భార్య సాయిలీల దగ్గరకు మాత్రం అప్పుడప్పుడూ వెళ్లేవాడు. అయితే మెట్టినింటికి తీసుకెళ్లాలని సాయిలీల భర్త లాలుస్వామిని అడిగింది. తన అక్కలకు, అమ్మకు తనను పెళ్లిచేసుకోవడం ఇష్టం లేదని చెప్పాడని, మెట్టినింటికి తీసుకెళ్లాలని గట్టిగా నిలదీసింది. ఈ నేపథ్యంలో సాయిలీలతో పాటు ఆమె అక్క ప్రవళిక, అన్న ఎర్రిస్వామి, వదిన శిల్ప, మామ నాగరాజుపై లాలుస్వామితో పాటు వారి కుటుంబ సభ్యులు దాడి చేశారు. వారంతా గాయపడటంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులే తనకు న్యాయం చేయాలని బాధితురాలు సాయిలీల విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



లారీ చక్రాల కింద ఇరుక్కుపోయిన రంగనాయకులు

తాడిపత్రి రూరల్: మండలంలోని సజ్జలదిన్నె క్రాస్‌లో ఆదివారం రంగనాయకులు(65) ద్విచక్ర వాహనంలో వెళ్తు లారీ కింద పడి మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ ఎస్ఐ కాటయ్య తెలిపారు. మండలంలోని ఆలూరుకు చెందిన రంగనాయకులు మోటర్ సైకిల్‌లో తాడిపత్రి నుంచి ఆలూరుకు వెళుతుండగా ప్రమాదం జరిగిందన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గార్లదిన్నెలో మరొకరు..

గార్లదిన్నె: మండల పరిధిలోని రామ్‌దాస్‌పేట గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... శింగనమల మండలం నిదనవాడకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి లాగేజీ ఆటోలో గేదేలను అనంతపురం మార్కెట్‌కు తరలిస్తున్నాడని చెప్పారు. అయితే రామ్‌దాస్‌పేట సమీపంలోకి రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆటో బోల్తా పడిందన్నారు. దీంతో లక్ష్మీనారాయణ (45) అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురము ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల సమస్యలపై అలసత్వం తగదు


కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటైన శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై అధికారులు, ప్రభుత్వం అలసత్వం వహించడం తగదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు అన్నారు. ఆదివారం ఆయన పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టును సందర్శించారు. కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫేస్–4లో కళ్యాణదుర్గం , రాయదుర్గం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల జీతాలు, 30 నెలల పీఎఫ్ చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారానికై ఈ నెల 18 నుంచి కార్మికుంతా సమ్మెబాట పడుతున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

కోదండ రామాలయానికి వందేళ్లు



అలంకరణలో కోదండ రాముడు

ఆత్మకూరు: సనప గ్రామంలో నిర్మించిన కోదండ రామాలయానికి వందేళ్లు పూర్తి కావడంతో రెండు రోజుల పాటు శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయంలో విశేష పూజలు, పూర్ణాహుతి, హోమాలు నిర్వహించారు. సోమవారం కూడా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు అఖండ భజన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోదండ రామాలయాన్ని 1925లో నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

బీటెక్ విద్యార్థినిని తల్లికి అప్పగించిన పోలీసులు

అనంతపురం: నగరంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని (20) అచూకీని టూటౌన్ పోలీసులు కనుగొన్నారు. ఆమెను తల్లికి అప్పగించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీకాంత్‌యాదవ్ వివరాలమేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఓ విద్యార్థిని అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నారు. గత సంవత్సరం డిసెంబర్ 20 తేదీ నుంచి విద్యార్థిని కనపడడం లేదు. మానసిక వ్యాధితో బాధపడుతున్న ఆమె ఉన్నఫలంగా హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లి అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను ఎవరూ గుర్తుపట్టకుండా మారువేషాల్లో తిరుగుతూ బంధువులు, స్నేహితులు గుర్తుపట్టని రీతిలో ఆ విద్యార్థిని ప్రయాణాలు చేసింది. కర్నూలు రైల్వేస్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు ఆమెను విచారించారు. మానసిక పరిస్థితి బాగోలేదని పోలీసులకు చెప్పడంతో టూటౌన్ పోలీసులకు కర్నూలు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఆ విద్యార్థినిని తల్లికి అప్పగించారు.

యువతి బలవన్మరణం



భువనేశ్వరి (ఫైల్)

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట శివారు భాగ్యనగర్‌కు చెందిన ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తిప్పేస్వామి, నీలావతి దంపతులు భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు సంతానం. చిన్నకూతురు దేవరకొండ భువనేశ్వరి (24) గతంలో వలంటీర్‌గా పని చేసింది. ఇటీవల ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో వార్డెన్‌గా చేరింది. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో హాస్టల్ నుంచి విధులు ముగించుకుని ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులతో పాటు సోదరి పెన్నహోబిలం నరసింహస్వామి ఆలయానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గుడికి రావాలంటూ భువనేశ్వరిని అడిగారు. తనకు కాస్త అలసటగా ఉందని విశ్రాంతి తీసుకుంటానని చెప్పడంతో ఆమెను ఇంట్లోనే వదిలి తక్కిన కుటుంబ సభ్యులంతా గుడికి వెళ్లారు. సాయంత్రం 4:30 గంటల సమయంలో తల్లిదండ్రులు ఇంటికి చేరుకున్నారు. తలుపు తట్టినా భువనేశ్వరి తీయలేదు. అనుమానం వచ్చి మేడమీదకు వెళ్లి వెంటిలేటర్ నుంచి చూడగా యువతి ఉరికి వేలాడుతూ కనిపించింది. డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి తలుపులు తీయించి ఉరికి వేలాడుతున్న భువనేశ్వరిని కిందకు దింపి ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన కారణాలపై రకరకాల ఊహాగానాలు అందుతున్నాయి. అసలు విషయం పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

ఉరేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్య

రాప్తాడురూరల్: తాగుడికి బానిసైన ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశులు (49), గౌరమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. వెంకటేశులు ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఇటీవల తాగుడికి బానిస కావడంతో తరచూ మద్యం కోసం తల్లి, భార్యను వేధిస్తుండేవాడు. పలు మార్లు ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరించే వాడు. ఈ క్రమంలో ఆదివారం మద్యం కోసం డబ్బులు అడిగాడు. లేవని చెప్పడంతో ఆత్మహత్య చేసుకుంటానని మరోమారు బెదిరించాడు. మామూలుగా ఇదేవిధంగా అంటున్నాడని వారు సీరియస్‌గా తీసుకోలేదు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకుని చీరతో ఉరి వేసుకున్నాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

2021 డిసెంబర్ 14న నగరంలోని గుత్తి రోడ్డు ఎన్‌టీఆర్ మార్గ్‌లో జనావాసాల మధ్య ఉండే గుజిరీ గోడౌన్‌లో భారీ పేలుడు సంభవించింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో అక్కడ పని చేసే ఇద్దరు కూలీలు గుజ్జల లింగేశ్వర్ రెడ్డి (44), రసూల్ బీ (60) మృత్యువాతపడ్డారు. కొందరు ఆస్పత్రుల పాలయ్యారు. ఇద్దరి కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. అయినా అధికారుల్లో ఏమాత్రం చలనం రాలేదు. ఇప్పటికీ నగరంలో పదుల సంఖ్యలో గుజిరీ దుకాణాలు జనావాసాల మధ్యలో ఉన్నాయి. గుజిరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. తమకేం పట్టదన్న ధోరణితో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

డేంజర్ గుజిరీ..



నగరపాలక సంస్థ వివరాలు..	
డివిజన్లు	50
సచివాలయాలు	74
గుజిరీ షాపులు మొత్తం	39
ఐరన్ స్క్రాప్ షాపులు	27
పేపర్ వేస్ట్ షాపులు	12
రోజూ టర్నోవర్	రూ.10 లక్షల పైమాటే

- నగరంలో ఇష్టారాజ్యంగా గుజిరీ షాపులు
- జనావాసాల మధ్యలో ఉండటంతో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా నిర్వహణ
- బెటర్‌మెంట్ చార్జీల వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న గుజిరీ గోడౌన్‌లతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో ఉండాల్సిన గుజిరీ గోడౌన్లు దేవాలయాలు, స్కూళ్ల పరిసర ప్రాంతాలు, జనవాసాల మధ్యలో ఉండటం డేంజర్ బెల్స్‌ను గుర్తు చేస్తున్నాయి. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా షెడ్లు వేసుకుని రోజూ రూ.లక్షల్లో టర్నోవర్ చేస్తున్నారు. జనావాసాల మధ్య వాటిని ఉంచకుండా సుదూర ప్రాంతాల్లో ఉంచాలని నగరవాసులు కోరుతున్నారు.

ఇప్పటికీ నగరంలో పాతూరు, అశోక్‌నగర్, నాయక్ నగర్, హౌసింగ్ బోర్డు, 1వ రోడ్డు, 6వ రోడ్డు, గుత్తి రోడ్డు, హౌసింగ్ బోర్డు, ఖాజానగర్, జీసస్ నగర్, తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో గుజిరీ షాపులు ఉన్నాయి. గుజిరీ షాపులకు వివిధ ప్రాంతాల నుంచి ప్లాస్టిక్, ఇనుము, రాగి, సీసాలు, ఆయిల్ బాటిల్స్, వైర్లు, తదితర గుజిరీ సరుకును తీసుకువస్తుంటారు.

ఆ సామగ్రిని మూటకట్టి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. గుజిరీ షాపుల నుంచి విపరీతమైన శబ్ద కాలుష్యం వెలువడుతోంది. జనావాసాల మధ్య ఉండటం ద్వారా విపరీతమైన శబ్దాలు వస్తుంటాయి. త్వరగా అంటుకునే సామాగ్రి గుజిరీ షాపులో ఉంటుంది. పొరపాటున ఏమైనా షార్ట్ సర్క్యూట్ జరిగినా.. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగే ఆస్కారం లేకపోలేదు.

రూ.లక్షల్లో ఆదాయానికి గండి

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న గుజిరీ షాపుల నిర్వాహకులు రోజూ రూ.లక్షల్లో వ్యాపారం సాగిస్తున్నారు. ఈ లెక్కన ప్రతి నెలా వీరి టర్నోవర్ కోటిపైగానే ఉంటోంది. ఇదెలా ఉన్నా నగరపాలక సంస్థకు ఎటువంటి బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించడం లేదు. వాస్తవంగా గుజిరీ షాపును 5 సెంట్ల నుంచి 10 సెంట్ల స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ లెక్కన నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్‌కు రూ.లక్షల్లో బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ అటువంటి పరిస్థితి లేదు. అదేవిధంగా అధిక సంఖ్యలో షాపుల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్‌లను ఏర్పాటు చేయలేదు.



నాయక్‌నగర్‌లో జనావాసాల మధ్య గుజరీ షాపు

ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మేలుకుని గుజిరీ షాపులను సుదూర ప్రాంతాలకు తరలిస్తారో లేదో వేచి చూడాలి.

శివారు ప్రాంతాల్లో ఉండాలి



నగరంలోని జనావాసాల మధ్యనే గుజిరీ షాపులున్న మాట వాస్తవమే. వాస్తవంగా గుజిరీ షాపులు నగర శివారు ప్రాంతాల్లో ఉండాలి. నగరంలో మొత్తం 39 షాపుల వరకు ఉన్నాయి. ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లిస్తున్నారో లేదో చూడాలి. ఆయా పారిశుధ్య కార్యదర్శులు పర్యవేక్షించాల్సి ఉంది. ప్రజలకు అసౌకర్యంగా ఉన్న విషయంపై పరిశీలిస్తాం. గుజిరీ షాపులను శివారు ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ విష్ణుమూర్తి, ఎంహెచ్‌ఓ

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

అనంతపురం అర్బన్: 'కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలలు దాటుతున్నా మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేలేదు. దీంతో ఆందోళన బాట పట్టాలని నిర్ణయించాము. సోమవారం నుంచి దశలవారీ ఆందోళన చేపడుతాం. ఈనెల 24న మునిసిపల్ కార్యాలయాల వద్ద ధర్నా, మార్చి 3న కలెక్టరేట్ వద్ద ధర్నా, మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నాము.' అని మునిసిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మునిసిపల్ కార్మికుల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. వేతనాలు ఇవ్వడం, నిర్వహణను మునిసిపల్ శాఖ ద్వారానే చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, కోశాధికారి వేణుగోపాల్, సభ్యులు ప్రసాద్, నాయకులు సాగర్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేష్ గౌడ్

దశలవారీగా ఆందోళన ఇలా..

సమస్య పరిష్కారానికి దశలవారీ ఆందోళనలో భాగంగా తొలి రోజు సోమవారం మునిసిపల్ కమిషనర్లకు వినతిపత్రం సమర్పిస్తారు. 19వ తేదీన ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తారు. 21వ తేదీన మస్టర్ల వద్ద నిరసన, 24న అన్ని మునిసిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా, 28వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తారు. మార్చి 3వ తేదీన కలెక్టరేట్ ఎదుట ఆందోళన, మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమం చేపడతారు.

ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలి

అనంతపురం అర్బన్: ఆటో డ్రైవర్ల సాధికారత సంస్థను ఏర్పాటు చేసి ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు ఇవ్వాలని అనంతపురం ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిండికేట్ నగర్ వద్ద కోడిమి, రాచానపల్లి, సిండికేట్ నగర్ ఆటో డ్రైవర్ల సమావేశం దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ.. ఈనెల 28న జరగనున్న అనంతపురం ఆటో డ్రైవర్ల సంఘం మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ విధానాన్ని ప్రైవేటుకు ఇవ్వడం నష్టదాయకమన్నారు. స్లాట్ బుకింగ్ మారితే మళ్లీ మొత్తం ఫీజు కట్టాలనే నిబంధన తీసివేయాలని కోరారు. లైసెన్స్ మేళా నిర్వహించాలని సూచించారు. మహాసభలో ఆటో డ్రైవర్ల సమస్యలపై విస్తృత స్థాయిలో చర్చించి వాటి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం రూట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం ఉపప్రధాన కార్యదర్శి కృష్ణా నాయక్, సహాయ కార్యదర్శి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనంతపురం ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

నూతన కమిటీ ఇదే..

రూట్ నూతన కమిటీ అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గోవిందు, వర్కింగ్ అధ్యక్షుడిగా ఓబుళరెడ్డిని ఎన్నుకున్నారు. కోశాధికారిగా రమేష్, సహాయ కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా నాగేంద్ర, కార్యవర్గ సభ్యులుగా మంజు, జాఫర్, వలి, నిరంజన్, షబ్బీర్, చిన్న, వన్నూరు స్వామి, రామాంజనేయులను ఎన్నుకున్నారు.

ముగిసిన సహస్రఘట కుంభాభిషేకం



అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి



ప్రసంగిస్తున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వేదికగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహా సహస్ర ఘట కుంభాభిషేకం ఆదివారం ముగిసింది. జిల్లాలోనే తొలిసారి మహా కుంభాభిషేకం నిర్విహించిన విషయం తెలిసిందే. మూలవిరాట్టుకు హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామీజీ అభిషేకం చేశారు. మహా మంగళహారతి, అలంకార సేవలు నిర్వహించిన అనంతరం ఆలయ గోపురంపై సహస్ర కలశాలతో వివిధ పుణ్యతీర్థాల నుంచి తెప్పించిన పవిత్ర జలాలతో అభిషేకం జరిపించారు. గోవింద నామస్మరణ చేస్తూ పవిత్ర జలాల సంప్రోక్షణ చేసిన అనంతరం స్వామీజీ మహా కుంభాభిషేక విశిష్టతను తెలియజేశారు. అనంతరం బారులు తీరిన భక్తులకు స్వామీజీ , ఇతర పండితులు రక్ష, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఏఎల్ఎన్ శాస్త్రి, ఆలయ అధ్యక్షులు పుట్టపర్తి రమణారెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్ర స్థాయి వెటరన్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

అనంతపురం: అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి వెటరన్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. ఇందులో 60 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు అనంతపురం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.బుగ్గయ్య చౌదరి, కార్యదర్శి జయకుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు షాషావలి, బోగేష్, ప్రతాప్ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

రమేష్‌కు శ్రీకృష్ణదేవరాయ ప్రతిభా పురస్కారం

అనంతపురం కల్చరల్: శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా తిరుపతి మహతి ఆడిటోరియంలో రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తున్న సామాజిక సేవకులను ఘనంగా సత్కరించారు. అనంతపురానికి చెందిన ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, రాయల్ యూత్ ఫెడరేషన్ సంస్థల ద్వారా సేవ చేస్తున్న సుంకర రమేష్‌కు శ్రీకృష్ణదేవరాయ ప్రతిభా పురస్కారం అందజేశారు. సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు బాలాజీ, ఫ్రెడ్ ఇండియా కల్చరర్స్ సీఈవో కోలా వేంకటేశ్వరరావు తదితరులు రమేష్‌ను సత్కరించి, జ్ఞాపిక అందించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: స్థానిక కామితార్థ మహాగణపతి పంచాయతస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. పీటీసీ ప్రాంగణంలోని దేవతామూర్తుల ముందు ఉదయం 108 గణపతి అథర్వశీర్ష ఉపనిషత్తులతో అభిషేకం, శ్రీరుద్ర, పురుష సూక్త, శ్రీసూక్త, మన్యుసూక్త హోమాలు నిర్వహించారు. వేదపండితులు సుంకేశుల సత్యనారాయణ శర్మ, ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షుడు పాలసముద్రం నాగరాజు, బ్రాహ్మణ సంఘం నాయకులు హోసూరు రామ సుబ్రహ్మణ్యం, శంకర మఠం సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

అనంతపురం: సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ శ్రీకారం చుట్టింది. సైబర్ సురక్ష (మన భద్రత–మన బాధ్యత) కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనంతపురం రూరల్ మండలం తడకలేరు, అశ్వర్థం, గార్లదిన్నె మండలం కోటంక, తదితర తిరునాలలో డిజిటల్ వాహనాల్లో వీడియోలను ప్రదర్శించి చైతన్యం కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఘనంగా అశ్వర్థ నారాయణ స్వామి జాతర



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: సోములదొడ్డి పంచాయతీ పరిధిలోని తడకలేరులో వెలిసిన అశ్వర్థ నారాయణ స్వామి జాతర ఘనంగా జరిగింది. శనివారం స్వామి వారి కల్యాణం జరిగింది. రాత్రి రథోత్సవం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను కట్టువద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ పూజలు చేపట్టారు. సర్పంచ్, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నారాయణ నాయక్‌కు డాక్టరేట్



అనంతపురం: యోగి వేమన వర్సిటీలోని మేథమేటిక్స్ విభాగంలో పరిశోధన చేసిన రాజావత్ నారాయణ నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ ఎస్.సునీత పర్యవేక్షణలో 'అప్లైడ్ మేథమేటిక్స్‌లో సిగ్నిఫికెన్స్ ఆఫ్ థర్మల్ రేడియేషన్ ఆన్ డిఫరెంట్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్ ఫ్లోస్ ఓవర్ ఏ స్టిచ్చింగ్ సీట్ అండ్ వేరియస్ బౌండ్రి కండిషన్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. రాజావత్ నారాయణ నాయక్ ప్రస్తుతం ఆత్మకూరు మండలం, తోపుదుర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి తిరునాల

గార్లదిన్నె: మండలంలోని కోటంక గ్రామంలో కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల మాఘమాసం మూడో ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగిస్తూ స్వామి వారి సన్నిధికి చేర్చారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీవారికి మహాన్యాసపూర్వక, ఏకవార రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంత్ర పుష్పం, మంగళహారతి గావించి సుబ్రమణ్యస్వామికి, వల్లిదేవతలకు వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అదేవిధంగా 108 శివలింగాల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు. అలాగే మూలవిరాట్ వద్ద ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసుకుని భక్తి శ్రద్ధలతో సేవించారు. ఇలా చేయడం వల్ల సకల రోగాలు నివారణ అవుతాయని ప్రజల నమ్మకం. భక్తుల కొంగుబంగారమైన సుబ్రహ్మణ్యస్వామి తిరునాలకు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో వచ్చి బానం వండి తలనీలాలు సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి, శ్రీవల్లి, దేవసేన విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ధ్వజ స్తంభం నిర్మాణ దాత మోదుపల్లి సుబ్బయ్య భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

తిరునాల సందర్భంగా గాజుల అంగళ్లు, తినుబండారాలు, చెరకు, బొరుగుల అంగళ్లు కిటకిటలాడాయి. భక్తుల సౌకర్యార్థం అనంతపురం నుంచి కోటంక దేవస్థానం వరకూ ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు రామాచార్యుడు



స్వామి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం టవర్‌క్లాక్: రాయసీమలో చెరువులు కట్టించి, రాయలసీమను రతనాల సీమగా మార్చిన గొప్ప సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు అని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అన్నారు. ఆదివారం రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయుల జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలాజీ కళ్యాణ మంటపం నుంచి టవర్‌క్లాక్ మీదుగా భారీ ర్యాలీ చేపట్టారు. నడిమి వంక వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరయ్య, రాయల్ మనోజ్, వెంకటేష్, సాయి, బళ్లారి వెంకటరాముడు, రాయల మురళి, భారతి, నాగభూషణం, బాబు రావు, రమేష్, చంద్రశేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించం

అనంతపురం: భూ కబ్జాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం. ఈ విషయంలో ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు పేర్కొన్నారు. అనంతపురం లెక్చరర్స్ కాలనీలో ఓ ప్రైవేట్ ల్యాండ్ ప్రహరీ ధ్వంసం చేసి దౌర్జన్యంగా తాత్కాలిక గుడిసెలు వేసి కబ్జాకు పాల్పడిన 8 మందిపై అనంతపురం త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వీరితో పాటు భూ కబ్జాకు పాల్పడిన మరి కొందరిపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణం సంజీవ్ నగర్‌కు చెందిన చదల్లా సత్యనారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, పోలు చంద్రా రెడ్డి, వెంపల్లి రామమునిరెడ్డి నలుగురు కలిసి లెక్చరర్స్ కాలనీలోని సర్వే నంబర్ 95–2ఏలోని 66 సెంట్ల భూమిని 2010 సంవత్సరంలో కంద్యాల జయలక్ష్మి నుంచి కొనుగోలు చేశారన్నారు. ఆ సమయంలోనే భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం భూమి చుట్టూ ప్రహరీ నిర్మించుకుని ఆధీనంలో ఉంచుకున్నారు. ఫిబ్రవరి 2వ తేదీ కొంత మంది వ్యక్తులు భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, ప్రహరీని ధ్వంసం చేసి, తాత్కాలిక గుడిసెలు వేసినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బాధితులు భూమి వద్దకు వెళ్లగా.. కొందరు వ్యక్తులు వీరిని బెదిరించారు. చదల్లా సత్యనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో భూ కబ్జా (ల్యాండ్ గ్రాబింగ్) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సీసీ రోడ్డు ఎత్తు తగ్గించాలి

రాప్తాడు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్డును మెయిన్ రోడ్డు (జీఎన్‌టీయూ రోడ్డు) కంటే 10 ఇంచుల ఎత్తు పెంచి వేస్తే ఇబ్బంది పడతామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు ఎత్తు పెంచితే వర్షాలు వచ్చినప్పుడు నీరు ఇళ్లలోకి చేరుతుందని తెలిపారు. పక్క కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కనే ఉన్న సీసీ రోడ్డును మామూలుగానే వేశారని గుర్తు చేశారు. ఈ రోడ్డును మాత్రం ఎందుకు ఎత్తు పెంచి వేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. రోడ్డు ఎత్తు తగ్గించకుండా రోడ్డు పనులు ప్రారంభిస్తే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని పలువురు కాలనీవాసులు పేర్కొంటున్నారు.

పంపనూరుకు పోటెత్తిన భక్తులు



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: మాఘమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలుత స్వామిని ఆలయ అర్చకులు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఆలయంలో త్రిచవిధ సూర్యనమస్కారాలతో అరుణ హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ హోమాలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో స్వామి దర్శనానికి గంటల సమయం పట్టింది. అలాగే మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేసి, మహా మంగళహారతి ఇచ్చారు.